# గోల్కొండ చెప్పిన కథ

## పెదపాటి శ్రీనివాస్

ప్రవాహంలా దూసుకుపోతున్న జనంలోకి సంకోచిస్తూనే అడుగుపెట్టాన్నేను. షరవళ్ళు తొక్కే గోదావరి నీటిలో పడ్డట్టు నా ప్రమేయం లేకుండానే సూట్‌కేస్‌తో సహా కంపార్ట్‌మెంట్‌లోకి నెట్టివేయబడ్డాన్నేను. అక్కడ్నుండి ప్రారంభమైంది సీట్‌కోసం అన్వేషణ. కంపార్ట్‌మెంట్ నిండా చూస్తే పాతికమంది లేరు. కానీ సీట్లన్నీ కర్చీఫ్స్‌తోనూ, టవల్స్‌తోనూ, సామాన్లతోనూ రిజర్వు చేయబడి ఉన్నాయి. పొరపచేసి ముందుగా ఎక్కడంవల్ల సీట్ సంపాదించుకోగల్గాన్నేను.

కంపార్ట్‌మెంటంతా గోలగోలగా ఉంది. చిన్నప్పట్నుం చీ రైలు ప్రయాణం అంటే చికాకు నాకు. చాలామంది రైలు ప్రయాణం చాలా హాపీగా ఉంటుందంటారు. కానీ నాకు చిన్నప్పట్నుంచీ రైలంటే ఎందుకో చిరాకు. అసలా ఫీలింగ్ ఎలా స్టార్టయ్యిందో కూడా

ముంచుకొస్తున్న ఉక్రోషాన్ని అదిమిపట్టుకుంటూ మౌనంగా కూర్చున్నాన్నేను.

ఇంతలో...

నా కెదురుగా కూర్చున్న కుర్రాళ్ళలో ఓ కుర్రాడు బ్యాగ్‌లో నుంచి ఓ మేగ్‌జైన్ తీసి చదువుకోసాగాడు. ఇంతలో అతని ఫ్రెండనుకుంటా. 'నీ వొక్కడివే చదువుకుంటే ఎలాగోయ్'' అంటూ ఆ పుస్తకంలోని కాగితాన్ని అందరికీ పంచసాగాడు. నావంతుకు వచ్చిన కాగితాన్ని అందుకుని చదవసాగాన్నేను. అదో సినిమా మేగ్జయిన్. అసలే చిరాకు, అందులోనూ సినిమా మాగ్జయిన్... నా దురదృష్టాన్ని నేనే నిందించుకుంటూ ఆ పేపర్ని చదువుతున్నట్టు నటించసాగాను. వెంటనే ఇచ్చేస్తే ఆ కుర్రాడు ఫీలవుతాడేమోనని.

ఇంతలో...

**బిక్కమొహం వేసుకుని ముందుకుపోతున్న ఆ కుర్రాణ్ణి పిలిచాన్నేను. తక్కున నాదగ్గర కొచ్చాడు వాడు. ''మీకు కావాలా సార్'' అంటూ. రెండు రూపాయలు ఇచ్చి ఒకటి తీసుకున్నాన్నేను. దైన్యంగా చూశాడా కుర్రాడు....**

తెలీదు నాకు. నాకు ఊహ తెలిసినప్పట్నుంచీ రైలంటే ఎలర్జీనే. తప్పక అప్పుడప్పుడు ఇలా వెళ్ళవలసి వచ్చినప్పుడు నా బాధ భగవంతుడికే తెలియాలి. సరిగ్గా ఓ పావుగంట గడిచాక.

గట్టిగా ఓ కూతకోసి బయల్దేరింది ట్రెయిన్. కాసేపటికి ఓ మాదిరి ప్రశాంతత చేకూరింది కపార్ట్‌మెంట్లో. నేను కూర్చున్నది ఫోర్‌సీటర్ అయినా అయిదుగురం సర్దుకుని కూర్చున్నాం. మా కెదురుగా ఉన్న సీటర్‌లోనూ అంతే. ఉక్కిరిబిక్కిరౌతూ కూర్చున్నారు. అందులోనూ నేను మధ్యలో కూర్చోవటంవల్ల చాలా అనీజీనెస్ ఫీలవసాగాన్నేను. మాకెదురుగానున్న సీట్లలో నలుగురు కుర్రాళ్ళు చివరగా ఓ ముసలాయన కూర్చున్నాడు. ఆ ముసలాయన ఎందుకో మాటిమాటికీ కదుల్తూ మూలుక్కుంటూ, సణుక్కుంటూ అనీజీగా కదలసాగాడు.

పైన ఉన్న రెండు బెర్తులపైనా అప్పటికే శ్రీ మహావిష్ణువు పోజు పెట్టేశారిద్దరు ప్రయాణికులు.

నా ముందుసీట్లో ముసలాయన ప్రక్కన కూర్చున్న కుర్రాడు. తన వంతు కాగితాన్ని చదివేశాడనుకుంటా, తన చేతిలోని కాగితాన్ని నాకందిస్తూ, నా చేతిలోని కాగితం కోసం చేయిచాపాడు. నా చేతిలోని కాగితాన్ని అతనికందించి, అతని చేతిలోని కాగితాన్ని తీసుకుంటూ అప్రయత్నంగా అతనివంక చూశాన్నేను. ఎందుకో మరలా మరలా చూడాలనిపించసాగిందతనివంక.

తెల్లటి లాల్చీ, పైజమా, భుజానికి సంచి, ఒత్తుగా పెరిగిన జుత్తు, వచ్చీరానట్లుగా ఉండే మీసాలు, చక్కటి ఆకర్షణీయమైన కళ్ళు, ఆడపిల్లలా సిగ్గుపడ్తున్నట్టుండే మొహం... ఎక్కడో... ఎక్కడో చూసినట్లు అన్పించసాగింది నాకు. ఆకర్షణీయమైన అతని మొహం చూచినందువల్ల అట్లా అన్పిస్తుందేమో అనుకోవటానికి నా మనస్సు ఒప్పుకోవట్లేదు. అతన్నెక్కడో చూసినట్లే ఉంది నాకు.

ట్రెయిన్ సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆగింది. నా ఎదుటి సీటంతా ఖాళీ అయిపోయింది. అక్కడ చాలామంది దిగిపోయారు. అందరితోపాటు ఆ కుర్రాడు కూడా దిగిపోయాడు. అప్పటికీ గుర్తురాలేదు నాకా కుర్రాడెవరైందీ.

నేను నాంపల్లిలో దిగి మా సుబ్బిగాడు అదే మా ఫ్రెండ్ సుబ్బారావింటికి ఎలా వెళ్ళానో కూడా నాకే తెలీదు. సుబ్బారావుతో మాట్లాడుతున్నా ఆ కుర్రాడిగురించే ఆలోచిస్తున్నాన్నేను. అక్కడికీ సుబ్బారావు ఆ విషయాన్ని కనిపెట్టి అడిగేశాడు. ''ఏరా ఏమిటీ పరధ్యానంగా ఉన్నావు' అంటూ విషయమంతా చెప్పాన్నేను. ''అందుకే వెధవ రచనల్లు మానమంటున్నది. కాస్త అందంగా ఉన్నవాళ్లే చూసినా, ఏదైనా గుర్తొచ్చినా నిన్ను నువ్వు మర్చిపోతావు. ఎందు డొక్క, గజ్జికుక్క ఇవికూడా నీ కథలకు ప్లాట్లేనా... వెధవ కథలూ, వెధవ పాట్లూనూ'' అంటూ తిట్టసాగాడు. నవ్వుకుంటూ వాడందించిన టవల్ తీసుకుని బాత్రూంలోకి దూరాన్నేను.

* * * * *

సుబ్బారావ్ ఆఫీస్ కెళ్ళేముందే చెప్పాను. అతనితో ఈరోజు గోల్కొండకు వెళ్తానని. ''అక్కడ రాళ్ళనీ, రప్పల్నీ, జనాభాని చూసి ఒళ్ళు మర్చిపోయి కూర్చోకు. మరలా నీ కోసం నేను తిరగాలి. త్వరగా వచ్చేయి'' అంటూ చిన్నసైజు ఉపన్యాసం ఇచ్చి వెళ్ళిపోయాడు వాడు.

లిబర్టీలో మెహదీపట్నం వెళ్ళే బస్ ఎక్కి మెహదీపట్నంలో దిగి అక్కడ్నుంచి గోల్కొండ బస్ ఎక్కి ఎట్లాగైతే గోల్కొండ చేరుకున్నాన్నేను. హైదరాబాద్‌లో గోల్కొండ, చార్మినార్, బిర్లామందిర్ ఇటువంటి ప్రదేశాలన్నీ నాకు కొత్త కాకపోయినా హైదరాబాద్ వచ్చిన ప్రతిసారీ గోల్కొండ తప్పనిసరిగా వస్తాన్నేను. గత ప్రాభవాలకు చిహ్నాలయినా ఆ కోట గోడల్ని, అక్కడి ప్రదేశాల్ని చూస్తూ ఎంతసేపైనా గడిపేయాలనిపిస్తుంది నాకు.

శిథిలమైపోతున్న చరిత్రని కళ్ళతోనే కాపాడుకుంటున్నట్లు అన్పిస్తుంది నాకక్కడున్నంత సేపూ.

సింహద్వారం చేరుకున్నాన్నేను. అక్కడా జనమందోహమే. ఒక్కసారి సింహద్వారాన్ని పైనుండి కిందకంటా చూస్తూ లోనికి పోయాన్నేను.

రామదాసును బంధించిన బందిఖానా చూసి బయటకు వచ్చి పైకెక్కసాగాన్నేను.

అక్కడ—

గోల్కొండ కోటపైకెక్కే ప్రతి వ్యక్తీ ఆ దారిలోంచే వెళ్ళే కూడలిలాంటి ప్రదేశంలో
చల్లటి నీడలో, ఓ బండమీద
తెల్లటి లాల్చీ పైజమాల్తో
బాసిపట్టు వేసుకొని,
కళ్ళు మూసుకుని

చేతిలోని వేణువును సన్నగా ఊదుతూ,
లయబద్ధంగా తలాడిస్తున్న అతను...

నాకు ట్రెయిన్‌లో కనబడిన కుర్రాడు. ఒక్కసారిగా ఫ్లాష్ వెలిగింది నా మెదడులో. ఆ కుర్రాడెవరైందీ అప్పుడు గుర్తుకొచ్చింది నాకు. అతని చేతిలోనున్న ఫ్లూటును చూడగానే.

''సార్ ఒక్కొటి రెండు రూపాయలే సార్. ఫ్లీజ్ తీసుకోండి సార్'' అన్న మాటలు నా చెవుల్లో



మార్మోగుతున్నాయి. ఒక్కసారి నా మనస్సు గతంలోకి వెళ్ళింది.

* * * * *

సరిగ్గా నాలుగు సంవత్సరాల క్రితం.

వాడకుండా వదిలేసిన కాజువల్ లీవ్స్‌ని వాడేయటానికి, ప్లస్ మావాళ్ళని చూసినట్లూ ఉంటుందనీ, మా ఇంటికి ప్రయాణమై బస్టాండ్‌కు చేరుకున్నాన్నేను. హఠాత్తుగా ఊడిపడ్డ నన్నుచూసి ఇంట్లో ఎవరెవరి ఫీలింగ్స్ ఎలా ఉంటాయో ఊహించుకుంటున్న నేను.

"సార్ ఒక్కోటే రెండు రూపాయలే సార్. ప్లీజ్ తెలుసుకోండి సార్" అన్న మాటలకు ఉలిక్కిపడి ఈ లోకంలోకొచ్చాను. నాకు కుడిపక్కగా నాలుగు అడుగుల దూరంలో నిల్చున్న ఓ వ్యక్తి ముందో కుర్రాడు అతని భుజానికి వేళ్ళాడుతున్న సంచిలో ఉన్నాయి కొన్ని ఫ్లూట్స్. అవి అమ్మాలని చూస్తున్నాడతనికి.

రఫ్‌గా చెదిరిన జుత్తూ, అతుకుల చొక్కా, పసితనపు ఛాయలు వీడని జిడ్డుకారుతున్న మొహం. కొండామన్నా అయిష్టత కల్గించేలా ఉందతని రూపం.

సాధారణంగా ఆ వయసు కుర్రాళ్ళు కార్లు తుడుస్తూనో, బూట్ పాలిష్ చేస్తూనో, పేపర్లు అమ్ముతూనో, దర్శనమిస్తుంటారు భావి భారత పౌరులం మేమే అన్నట్లుగా.

కానీ—

ఈ కుర్రాడు స్పెషల్‌గా ఫ్లూట్స్ అమ్మడం నాకు వింతనిపించింది. "నాకేం అవసరం లేదు పోవోయ్" దేశంలోని అధికారమంతా గొంతులోకి తెచ్చుకుని సభ్యతకూడా మర్చిపోయి ఆ కుర్రాడిపై అరిచాడా వ్యక్తి.

చిక్కమొహం వేసుకుని ముందుకుపోతున్న ఆ కుర్రాణ్ణి పిలిచాన్నేను. తక్కున నాదగ్గర కొచ్చాడు వాడు. "మీకు కావాలా సార్" అంటూ. రెండు రూపాయలు ఇచ్చి ఒకటి తీసుకున్నాన్నేను. "అవునూ. ఎవరు కొంటారని ఇవి పట్టుకుని అందర్నీ బతిమాలుతున్నావు. ఎవరికి అవసరం ఇది?" అడిగాన్నేను.

దైన్యంగా చూశాడా కుర్రాడు నా మొహంలోకి.

"మా నాన్న ఫ్లూట్స్ బాగా తయారుచేసేవాడు సార్. నాకూ ఈ పనే నేర్పాడు"

"చేసేవాడు అంటున్నావు ఇప్పుడు లేడా మీ నాన్న"

అడిగాన్నేను.

"లేదు సార్. యాక్సిడెంట్లో పోయాడు. మా నాన్న ఉన్నప్పుడు బాగానే ఉండేది సార్. షాపుల్లో కూడా ఇచ్చేవాళ్ళం. మానాన్న పోవడంతో మా బ్రతుకిలా వీధులపాలైంది సార్!" దుఃఖాన్ని అతి ప్రయత్నంమీద ఆపుకుంటున్నట్లు నాకు తెలుస్తూనే ఉంది.

అక్కడికీ ఆపుకోలేక వెక్కివెక్కి ఏడ్వేయసాగాడు వాడు.

"ఛఛా! ఎడవకు. ఏమిటిలా ఆడపిల్లలా" అన్నాన్నేను. వాణ్ణెలా సముదాయించాలో అర్థం కాలేదు నాకు. ఇప్పుడు మా అమ్మకూడా జబ్బుతో ఉందిసార్. మా అమ్మకూడా బ్రతికేలా లేదుసార్" వెక్కిళ్ళమధ్యే చెబుతూ చొక్కా పైకెత్తి కళ్ళని తుడుచుకోసాగాడు వాడు. జేబులోనుండి పది రూపాయలనోటు తీసి వాడికివ్వబోయాన్నేను "ఉంచు మీ అమ్మకి మందులకి పనికొస్తాయి" అంటూ, "వద్దుసార్ ఊరికే నాకాడబ్బు వద్దుసార్. మీకు అంతగా ఇవ్వాలనుంటే ఈ అయిదు ఫ్లూట్లు తీసుకుని ఇవ్వండిసార్" అంటూ అయిదు ఫ్లూట్లు తీసి నాకందించాడు వాడు. తప్పనిసరై అవి అందుకున్నాన్నేను పదినోటు వాడికిచ్చి.

ఓసారి చేతులు జోడించి నమస్కరించి ఆనందంగా ముందుకుపోతున్న వాడి మొహంలో ఏదో తెలీని ఆకర్షణ కన్పించసాగింది నాకు.

బాల కార్మికుల కోసం ఎన్నో పథకాలను అమలుచేస్తున్నాం, మరెన్నో సిద్ధం చేస్తున్నాం అంటుంటారు మన నాయకులు.

కానీ,

ఇటువంటి నిర్భాగ్యుల వ్యథనెవరు తీరుస్తారు.

ఇంతలో నేనెక్కవలసిన బస్ వచ్చింది.

ఇంటికి వెళ్ళాక కొన్నాళ్ళ వరకూ గుర్తున్నాడు. తర్వాత నా. మస్తిష్కంలోంచి తప్పుకున్నాడా కుర్రాడు.

* * * * *

నా ఊహల్లోంచి తేరుకునేసరికి చాలామంది జనం ఆ కుర్రాడి చుట్టూ చేరారు. ఎవరికి తోచిన విధంగా అతని గానాన్ని పొగడసాగారు. అతని మొహం సిగ్గుతో ఎరుపెక్కసాగింది. హఠాత్తుగా ఓ కుర్రాడు ముందుకొచ్చి "ప్లీజ్ నాకీ ఫ్ల్యూట్ ఇవ్వరూ! నాకు ఫ్లూటు ఊదడం రాదు. అయినా మీ గానం విన్నాక నాకిది కావాలన్పిస్తుంది. ప్లీజ్ ఇవ్వరూ" ఎంతో సౌమ్యంగా అడిగాడు.

"ఇదా! మీకా!" ఆశ్చర్యంగా అడిగాడా కుర్రాడు.

"అవును ఇంకో ఫ్లూటు మీరెలాగైనా సంపాదించుకోగలరు. ఇది నాకివ్వండిసార్. రేటెంతైనా ఫర్వాలేదు" అంటూ జేబులోనుండి ఓ వంద రూపాయల నోటుని బయటికి తీసాడా కుర్రాడు.

ఇంతలో ఇంకొకాయన ముందుకొచ్చాడు ఆ ఫ్లూటు తనక్కావాలంటూ.

అలా... అలా... ఆ కుర్రాణ్ణి మాట్లాడనివ్వకుండానే ఆ ఫ్లూట్‌ని వేలం వేసేయసాగారు. కొంతసేపటికి ఐదువందల వరకు వెళ్ళి ఆగిపోయింది పాట. ఆశ్చర్యంగా అన్పించింది నాకు. కలా నిజమా అన్పించసాగింది నాకు.

అయిదువందలు ఆ కుర్రాడికందించి అతని చేతిలోని ఫ్లూటును తీసుకున్నాడు ఓ వ్యక్తి! అతని కళ్ళల్లో 'నేనే మీ అందర్లో హీరోని సుమా!' అన్న ఫీలింగ్ కనబడుతోంది.

అప్పుడర్థమైంది నాకు ఆ కుర్రాడు ఉపయోగించిన టెక్నిక్.

రెండు రూపాయలు పెట్టి ఫ్లూటు కొనుక్కోవటానికి ఆ కుర్రాణ్ణి చీదరించుకున్నదీ ఈ జనమే, ఐదొందలు పెట్టి బ్రతిమారి కొనుక్కున్నదీ ఈ జనమే...

ఎందుకో ఆ రెండు దృశ్యాల్నీ కంపేరిజన్ చేస్తే, చూసింది నేనేనయినా నమ్మశక్యం కావట్లేదు నాకు.

ఇతన్లో ఇన్ని తెలివితేటలున్నాయా!

ఫ్లూటు కొనుక్కున్న వ్యక్తి దాన్ని అపురూపంగా చూస్తూ గర్వంగా తలాడిస్తుంటే మిగిలా జనం అంతా అతనికేసి ఈర్ష్యగా చూస్తూ ముందుకు కదలసాగారు.

కొద్దిసేపటికి అందరూ వెళ్ళిపోయాక ఆ కుర్రాడి దగ్గరకి నడిచాన్నేను. నావంక చూశాడతను ప్రశ్నార్థకంగా.

"ఫిజికల్‌గానే కాదు, మెంటల్‌గా కూడా బాగా ఎదిగావే?" అన్నాన్నేను. నా మాటలు అర్థం కానట్లు అతని మొహమే చెబ్తుంది.

"ఒక ఫ్లూటు రెండు రూపాయల చొప్పున పది రూపాయలకు ఐదు ఫ్లూట్లు ఎవరికైనా అమ్మావా?" అడిగాన్నేను. అప్పుడర్థమైనట్లుంది నేనెవర్నైందీ, అప్రయత్నంగానే చేతులు జోడించాడా కుర్రాడు. "సార్! మీరు..." అర్ధోక్తిలోనే ఆపాడు. "రెండు రూపాయలకి ఒక్క ఫ్లూటు బ్రతిమాలి అమ్మావు కదా! ఈరోజు అయిదువందలకి అమ్మావు అన్యాయం కాదా" అన్నాన్నేను సన్నగా నవ్వుతూ.



కదామరి

"ఏలా బాలూ? నూకలు కోడిపిల్లకి పెట్టమంటే పిల్లికి పెడుతున్నావేరా?"

"కోడిపిల్ల పిల్లి పొట్టలోకి వెళ్ళిపోయింది మరి—"

—సిరిసిల్లా రశీద్ శ్రీకక్
(బీబీపేట)

తల అడ్డంగా ఊపాడు ఆ కుర్రాడు.

"లేదుసార్! ఆరోజు మీరు చూశారుగా! అదే పరిస్థితిలో ఇంకెవరైనావుంటే వాళ్ళ ఆలోచనలు నయెలెన్స్, టెర్రరిజంవైపునకు దారితీసేవే కాదంటారా? అడిగాడు నన్ను. కాదని ఎలా అనగలను. పొరపాట్న ఎవరైనా డాష్ ఇస్తేనే కాలర్ పుచ్చుకునో, క్రికెట్‌స్టంప్ పుచ్చుకునో ఫైటింగ్‌కు దిగుతున్న వ్యక్తుల్ని రోజుకెంత మందిని చూడట్లేదు.

"కానీ నేనలా అవలేదే. నాకున్న తెలివితేటల్తో నాకొచ్చిన విద్యను క్యాష్ చేసుకుంటున్నాను తప్ప, ఎవరిసొమ్ము అన్యాయంగా కాజేయట్లేదుగా. వీధిలో ముష్టివాడికి పదిపైసలెయ్యటానికి ఈసడించుకుని బార్‌లో బేరర్‌కి పచ్చనోట్లు టిప్‌గా ఇచ్చే ఈ మనుషుల పొర్స్ ప్రిస్టేజ్‌ని, బయట రూపాయికి దొరికే వస్తువుని అద్దాల బీరువాలో ఉంచితే పాతిక రూపాయికి కొనే ఈ మనుషుల వెర్రిబాగులతనాన్ని, అతి తెలివితేటల్ని, అటువంటి వీక్నెస్‌ని నా వ్యాపారానికి ఎనర్జీగా వాడుకుంటున్నాను ఇది తప్పంటారా?"

సూటిగా అతనలా అడుగుతుంటే ఏం చెప్పలేకపోయాన్నేను.

"మరి మీ అమ్మగారు?"

టాపిక్ మార్చటానికన్నట్లుగా అడిగాన్నేను.

"ఆవిడ అప్పుడే పోయిందిసార్. ఆవిడ అంతిమ శ్వాసే నా ఈ రూపానికి తొలి శ్వాస అయింది. వస్తాను సార్" అంటూ క్రిందికి దిగిపోతున్న అతన్ని చూస్తూ నిల్చుండిపోయాన్నేను.

అలా... నాకు మరో కథకు ప్లాటు దొరికింది. ❀



## అన్నోన్

అక్కినేనికి దాదా ఫాల్కే అవార్డు ప్రదానం జరిగిన మరునటి రోజున ఢిల్లీలో ఎఫ్ఐసిసిఐ ఆడిటోరియంలో ఓ సభలో అక్కినేనిని సన్మానించిన ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ మార్కండేయసింగ్ ప్రసంగిస్తూ అక్కినేని గురించి తనకు ఏమీ తెలీదు అన్నారు. సభా మర్యాదకైనా సన్మానితుని గురించి తెలుసుకొని ప్రసంగిస్తే బాగుండేదేమోకదా!

—శరత్ కుమార్

